ఆదాయం ఢమాల్!

- ఆరేండ్లలో తొలిసారి తగ్గిన ఏప్రిల్ ఆదాయం
- రెవెన్యూ రాబడుల్లో రూ.580 కోట్లు తగ్గుదల
- సొంత పన్ను ఆదాయంలో 547 కోట్లు క్షీణత
- రేవంత్ పాలనలో గాడినపడని రాష్ట్ర రాబడులు
- ట్యాక్స్ రెవెన్యూ తగ్గడం ఇప్పుడే మొదటిసారి
- కాగ్‌కు సమర్పించిన ఏప్రిల్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర రాబడులు ఏటేటా పెరగగా, కాంగ్రెస్ పాలనలో మాత్రం తగ్గుతున్నాయి. రేవంత్ సర్కార్ అనాలోచిత విధానాలు, నిర్ణయాలు రాబడికి గండి కొడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గడిచిన ఐదేండ్లలో నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ నెలలో రెవెన్యూ రాబడులు ప్రతియేటా పెరిగాయి. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెల రెవెన్యూ రాబడి ఏకంగా రూ.579.75 కోట్లు సొంత ట్యాక్స్ రెవెన్యూలో కూడా రూ.547.49 కోట్ల క్షీణత రికార్డయింది. ఈ విషయాన్ని కాగ్‌కు సమర్పించే నెలవారీ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కాగ్ నివేదిక ప్రకారం... 2025-26 బడ్జెట్‌లో అన్ని రకాల ఆదాయ మార్గాల్లో రూ.2,29,720.62 కోట్ల రెవెన్యూ రాబడులు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, మొదటి నెల ఏప్రిల్‌లో రూ.11,239.13 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే అంచనాలో 4.89% లక్ష్యాన్ని చేరుకున్నది. ఇదే తరహాలో ప్రతినెలా 5 శాతమే రాబడి వస్తే అంచనాలో 60 శాతానికి పరిమితం అవుతుంది. 2023-24లో బడ్జెట్ అంచనాకు 78.08% చేరగా, కాంగ్రెస్ అధికారం చేపట్టాక 2024-25లో 75.85 శాతానికే పరిమితమైంది. లక్ష్యంలో రెండున్నర శాతం తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 60-70% లక్ష్యం చేరడమే కాంగ్రెస్ సర్కారు కష్టతరంగా మారనున్నది. ఏటేటా క్రమంగా రెవెన్యూ రాబడులు పెరగాల్సింది పోయి తగ్గుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్ నెల రెవెన్యూ రాబడులు గడిచిన ఐదేండ్లలో పెరగగా, తొలిసారిగా ఆదాయం తగ్గుదల రూ.579.75 కోట్లు నమోదైంది.

2024-25 ఏప్రిల్‌లో రెవెన్యూ రాబడి రూ.11,818.88 కోట్లు

2025-26 ఏప్రిల్‌లో రెవెన్యూ రాబడి రూ.11,239.13 కోట్లు

తగ్గుదల రూ.579.75 కోట్లు

2024-25 ఏప్రిల్‌లో ట్యాక్స్ రెవెన్యూ ఆదాయం రూ.11,464.17 కోట్లు

2025-26 ఏప్రిల్‌లో ట్యాక్స్ రెవెన్యూ ఆదాయం రూ.10,916.68 కోట్లు

తగ్గుదల రూ.547.49 కోట్లు

గత ఆరేండ్లలో ఏప్రిల్‌లో రెవెన్యూ రాబడులు

2020-21	రూ.3,377.61 కోట్లు (కొవిడ్ కాలం)
2021-22	రూ.8,050.60 కోట్లు
2022-23	రూ.9,983.80 కోట్లు
2023-24	రూ.10,056.29 కోట్లు
2024-25	రూ.11,818.88 కోట్లు
2025-26	రూ.11,239.13 కోట్లు

గత ఆరేండ్లలో ఏప్రిల్‌లో ట్యాక్స్ రెవెన్యూ ఆదాయం

2020-21	రూ.1,700.04 కోట్లు (కొవిడ్ కాలం)
2021-22	రూ.7,618.06 కోట్లు
2022-23	రూ.9,291.97 కోట్లు
2023-24	రూ.9,698.65 కోట్లు
2024-25	రూ.11,464.17 కోట్లు
2025-26	రూ.10,916.68 కోట్లు

పడిపోయిన 'పన్ను' ఆదాయం

రాష్ట్ర ఖజానాకు వచ్చే రాబడిలో పన్ను ఆదాయం కీలకమైనది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, జీఎస్టీ ఇలా.. పన్నుల రూపంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతుంది. ఈ పన్నుల రాబడి భేషుగ్గా ఉంటే.. రాష్ట్ర ఆర్థిక ప్రగతి బాగున్నట్టు లెక్క. 2025-26 బడ్జెట్‌లో ట్యాక్స్ రెవెన్యూ రూ. 1,75,319.35 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ఏప్రిల్‌లో రూ. 10,916.68 కోట్లు (6.23%) మాత్రమే వచ్చింది. గత ఏడాది ఇదే నెల రూ. 11,464.17 కోట్లు ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్యాక్స్ రెవెన్యూ రూ.547.49 కోట్లు తగ్గింది. ప్రతియేటా పన్ను ఆదాయం పెరగాల్సి ఉండగా, సర్కారు అసంబద్ధ నిర్ణయాలతో క్షీణిస్తున్నది. రేవంత్ రెడ్డి అధికార పగ్గాలు చేపట్టి 17 నెలలైనా నేటికీ రాష్ట్రానికి వచ్చే రాబడులు గాడినపడటం లేదు. రాష్ట్ర ఖజానా ఒడిదొడుకులను ఎదుర్కొంటూనే ఉన్నది. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఒక్క కొవిడ్ పిరియడ్ మినహా ఇస్తే ప్రతియేటా బడ్జెట్ అంచనా లక్ష్యానికి చేరువైంది. కానీ, కాంగ్రెస్ సర్కారు 70-75% దగ్గరే చతికిల పడుతున్నది. రెవెన్యూ రాబడులు పెంచేందుకు రేవంత్ సర్కారుకు దీర్ఘకాలిక ప్రణాళికలు, వ్యూహాలు లేకపోవడమే కారణమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

బీఆర్ఎస్ భవన్‌లో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి తదితరులు

5 గంటల క్యాబినెట్

భేటీతో సాధించిందేంది?

- ఆరు గ్యారెంటీల అమలు ఊసేది?
- అన్ని వర్గాల ప్రజల ఆశలపై నీళ్లు
- ఏడాదిన్నర కాంగ్రెస్ పాలన దగా
- అడుగడుగునా కమీషన్ల పర్వం
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ
- ఉద్యోగులకు నిరాశ: దేవీప్రసాద్
- బనకచర్ల ప్రాజెక్టుపై చర్చేది: పల్లె

హైదరాబాద్ జూన్ 6 (నమస్తేతెలంగాణ): నిన్న ఐదు గంటలపాటు రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్ నిర్వహించి చర్చించింది ఏమిటి? తీసుకున్న నిర్ణయాలేమిటి? అని ముఖ్యమంత్రి, మంత్రులను శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి నిలదీశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల ఊసే ఎత్తకుండా రాష్ట్ర ప్రజల ఆశలపై సర్కారు నీళ్లు చల్లిందని దుయ్యబట్టారు. నాడు ఓట్ల కోసం ఆడబిడ్డలు, ఆటోడ్రైవర్లను, కార్మికులను, కర్షకులను, కూలీలను మభ్యపెట్టి ఓట్లేయించుకొన్న కాంగ్రెస్.. గద్దెనెక్కిన తర్వాత మొండిచెయ్యి చూపుతున్నదని నిప్పులు చెరిగారు. ఇచ్చిన హామీలను అటకెక్కించి కమీషన్ల పేరిట చీకటిరాజ్యం నడుపుతున్నదని విరుచుకుపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్, దిలీప్‌రెడ్డితో కలిసి మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నరలో రాష్ట్ర ప్రభుత్వం మూడుసార్లు ఇవ్వాల్సిన రైతుబంధు నిధులను ఒక్కసారే ఇచ్చి అన్నదాతను దగా చేసిందని విమర్శించారు. 'సీఎం, మంత్రుల మాటలు కోటలు దాటుతుంటే కాలు మాత్రం కడప దాటడంలేదు.. 18 నెలల్లో అభివృద్ధి కుంటుపడింది.. సంక్షేమం ఆగమైంది.. వెరసి రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తున్నది' అని దుయ్యబట్టారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కేసీఆర్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తే.. రేవంత్ సర్కారు ఏడాదిన్నర పాలనలో అన్ని రంగాలను దెబ్బతీసి సర్వనాశనం చేస్తున్నది' అని మండిపడ్డారు. ఆ ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌కు పగుళ్లు వస్తే రిపేర్లు కూడా చేయించలేని అసమర్థ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. కోతికి పుండు పుట్టినట్టు చిన్న సమస్యను పెద్దదిగా చేస్తున్నదని మండిపడ్డారు. ఇంతటి స్వల్పకాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం దేశంలో మరొకటి లేదని విమర్శించారు. తెలంగాణ జాతి చైతన్యాన్ని తక్కువగా అంచనా వే యొద్దని రేవంత్ ప్రభుత్వానికి హితవు పలికారు. నాటి సాయుధ పోరాటం నుంచి తెలంగాణ ఉద్యమం దాకా నరనరాన చైతన్యానికి నింపుకొన్న నేల ఇది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

క్యాబినెట్‌లో పీఆర్సీ ఊసేది?: దేవీప్రసాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పీఆర్సీ ఊసెత్తకుండా ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర నిరాశకు గురిచేసి దగా చేసింది..అని ఉద్యోగ సంఘాల మాజీ నేత దేవీప్రసాద్ విమర్శించారు. గుట్టను తవ్వి గులకరాయి కూడా తీయలేదని ఎద్దేవా చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ వేసి, మంత్రుల కమిటీని, అధికారుల కమిటీని వేసి చర్చోపచర్చలు చేసి సాధించిందేమిటని నిలదీశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏల్లో రెండు మాత్రమే ఇస్తామని, అందులో ఒకటి ఆరు నెలల తర్వాత విడుదల చేస్తామని ప్రకటించడం చూస్తుంటే ఉద్యోగుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కారుకున్న చిత్తశుద్ధిలేమి వెల్లడైందని చెప్పారు. రూ.11 వేల కోట్ల ఉద్యోగుల బకాయిలను ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున ఇస్తామనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. గతంలో రూ.500 కోట్లు ఇస్తామని ఎగ్గొట్టిన చరిత్ర రేవంత్ రెడ్డి సర్కారు సొంతమని ఆరోపించారు. మూడు విడుతల్లో విడుదల చేయాలని, ఉద్యోగ సంఘాలను పిలిచి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

గోదావరి-బనకచర్ల లింక్‌పై చర్చేది?: పల్లె రవికుమార్‌గౌడ్

'క్యాబినెట్ మీటింగ్‌లో గోదావరి-బనకచర్ల లింక్‌పై ఎందుకు చర్చించలేదు? ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు కూడబలుక్కొని వరద జలాల ముసుగులో గోదావరిని చెరబట్టేందుకు కుట్రలు చేస్తుంటే రేవంత్ సర్కారు ఏం చేస్తున్నది?' అని కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ ప్రశ్నలను సంధించారు. 'ఉమ్మడి పాలనలో కృష్ణా జలాలను దోపిడీ చేసిన తరహాలోనే ఇప్పుడు చంద్రబాబు గోదావరిలోని 200 టీఎంసీలను తరలించుకుపోయేందుకు యత్నిస్తున్నారు.. ఇందుకు నిధులిచ్చి, రుణ పరిమితి మినహాయింపు ఇచ్చి ప్రధాని మోదీ సహకరిస్తున్నారు.. రేవంత్ వీరిద్దరికీ వంతపాడుతున్నారు.. అని ధ్వజమెత్తారు. తన గురువు కోసమే మన ముఖ్యమంత్రి కాళేశ్వరంలోని మేడిగడ్డను పునరుద్ధరించడమే లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీల డ్రామాలను బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని తేల్చిచెప్పారు. పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

ఉద్యోగులను నమ్మించి

నట్టేట ముంచిన కాంగ్రెస్

మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం

హైదరాబాద్ జూన్ 6 (నమస్తే తెలంగాణ): నాడు ఓట్ల కోసం ఉద్యోగులకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు నట్టేట ముంచిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను చర్చించకుండా నాన్చి వేత ధోరణి అవలంబించిందని శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఐదు డీఏలు ఇస్తామని, పీఆర్సీ అమలుచేస్తామని చెప్పి, ఇప్పుడు రెండు డీఏలే ఇస్తామనడం విడ్డూరమని పేర్కొన్నారు. ఇందులో ఒక డీఏ వచ్చే ఏప్రిల్‌లో ఇస్తామనడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. రెండు నెలలు గడిస్తే మరో డీఏ ఇవ్వాల్సి ఉంటుందని, అంటే కాంగ్రెస్ సర్కారు మళ్లీ నాలుగు డీఏలను పెండింగ్‌లో పెడుతున్నదని విమర్శించారు. నెలకు రూ.500 కోట్లు కేటాయిస్తామని చెప్పి మాట తప్పిన ప్రభుత్వం, ఇప్పుడు రూ.700 కోట్లు ఇస్తామంటే నమ్మేదెలా అని ప్రశ్నించారు.

ఒక్క డీఏ ప్రకటించడం సిగ్గుచేటు

ప్రభుత్వంపై డీకే అరుణ మండిపాటు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే కేవలం ఒక్క డీఏను మాత్రమే ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఐదుగంటలు క్యాబినెట్‌లో చర్చించి.. ఒక్కటంటే ఒక్క డీఏ ప్రకటించడం ప్రభుత్వ ఉద్యోగులందరినీ అవమానించడమే అవుతుందని దుయ్యబట్టారు. పెండింగ్‌లోని మిగిలిన డీఏలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్‌చేశారు.

డీఏనా? బిచ్చమా?

ఉద్యోగులంటే అంత చులకనా?

- ఒక్క డీఏ ఇవ్వడానికే మూడు కమిటీలు, ఆరుసార్లు చర్చలా?
- పీఆర్సీకి మరో కమిటీ వేస్తరా?
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఉద్యోగుల ఆగ్రహం
- ఆందోళనలు వాయిదా వేసిన జేఏసీ
- పోరాడాల్సింది పోయి భజనలా? అని జేఏసీ నేతలపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): 'పంచభక్ష్య పరమాన్నం పెట్టబడును. కానీ, ఇవాళ ఒక గంటెడు అన్నం వేస్తాం.. ఆరు నెలల తర్వాత గంటెడు సాంబార్ పోస్తాం' అన్నట్టుగా డీఏల విడుదల విషయంలో ప్రభుత్వం తీరు ఉన్నదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'ఇప్పుడైతే డీఏ ప్రకటన చేశారు. కానీ, జీవో రావాలి. ఈ నెల జీతంతోనే ఇస్తరా? వచ్చే నెల జీతంతో ఇస్తరా? ఎన్ని ఇన్‌స్టాల్‌మెంట్లు పెడతారు? అన్నది తేలనే లేదు. కానీ, కొన్ని సంఘాల నాయకులు ఇప్పుడే ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. హర్షాలు వ్యక్తంచేస్తున్నారు. ఏం సాధించారో ..ఏం తీసుకొచ్చారో వారికే తెలియాలి' అంటూ ఉద్యోగులు జేఏసీ నేతల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పుడు ఒక డీఏ, ఏప్రిల్‌లో మరో డీఏ ఇస్తామంటూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. 'బిచ్చమేసినట్టు ఒక డీఏ ఇస్తరా? ఉద్యోగులంటే అంత చులకనా? ఒక్క డీఏకు మూడు కమిటీలు.. ఆరుసార్లు చర్చలా? రేపు పీఆర్సీ అమలుకు ఇదే తరహాలో కమిటీలేసి సాగదీస్తరా?' అని మండిపడుతున్నారు. ప్రభుత్వం కమిటీలు వేసింది.. చర్చలు జరిపింది ఒక్క డీఏ కోసమేనా? అని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి, చర్చల సమయంలో ప్రస్తుతం మూడు డీఏలిచ్చి, మరో రెండు డీఏలను పీఆర్సీలో కలపాలని జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. కానీ, సర్కారు ఒకే ఒక్క డీఏతో సరిపెట్టింది. రెండో డీఏను ఆరు నెలల తర్వాత ఇస్తామన్నది. రెండో డీఏ ఇవ్వాల్సిన ఆరు నెలల్లో మరో రెండు కొత్త డీఏలు ఇవ్వాల్సి ఉంటుంది. అంటే మళ్లీ మోసమేనా? అంటూ నిలదీస్తున్నారు.

అయినా ఐదు డీఏలు పెండింగ్

డీఏలు ఇచ్చినట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా, అసలు ఇచ్చినట్టా? ఇవ్వనట్టా? అన్న ప్రశ్నలొస్తున్నాయి. ఇప్పుడు ఒక డీఏ, ఆరు నెలల్లో రెండో డీఏ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. జూలై ఒకటి వస్తే ఆరో డీఏ పెండింగ్‌లో పడుతుంది. మళ్లీ జనవరి 2025 వస్తే ఏడో డీఏ పెండింగ్‌లో పడుతుంది. ఇప్పుడిచ్చే ఒక డీఏను తీసేస్తే.. 2025 జూలై డీఏను కలుపుకుంటే పెండింగ్ డీఏల సంఖ్య మళ్లీ ఐదుకు చేరుతుంది. ఆరు నెలల తర్వాత రెండో డీఏ ఇచ్చారని అనుకుందాం. అప్పటికే జనవరి దాటుతుంది. జనవరి 2026 డీఏను కలిపితే పెండింగ్ డీఏల సంఖ్య మళ్లీ ఐదుకు చేరుతుంది. ఇప్పుడేమో రెండు డీఏలిచ్చినట్టు ప్రకటించి ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఉద్యోగులు మండిపడుతున్నారు. పెండింగ్ డీఏలతో రాష్ట్రంలోని ఒక్కో ఉద్యోగి సగటున నెలకు సుమారు రూ.15 వేల చొప్పున నష్టపోతున్నారు. కనీసం మూడు డీఏలు ఇవ్వాలని జేఏసీ కోరినా, సర్కారు ఖాతరు చేయలేదు. ఒకే ఒక్క డీఏతో సరిపెట్టింది. డీఏ బకాయిలు ఎప్పుడిస్తారో స్పష్టత లేదు. 'నన్ను కోసుకుతిన్నా.. రూపాయిలేదన్న పరిస్థితి నుంచి డీఏలైతే ఇప్పించగలిగాం. ఏం లేదన్న స్థాయి నుంచి కొంతవరకు లాక్కురాగలిగాం. అంత కుమించి మేమేం చేయగలం' అంటూ జేఏసీ నేత తన నిస్సహాయతను వ్యక్తంచేశారు.

సమరం లేనట్టే!

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రకటించిన పోరాట కార్యాచరణకు దాదాపు ముగింపు పలికినట్టేనని తెలుస్తున్నది. ఉద్యోగుల 57 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మార్చి 12న ఉద్యోగ సంఘాల జేఏసీ కార్యాచరణ ప్రకటించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం మే 15న అన్ని జిల్లాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలపాల్సి ఉండగా, ప్రభుత్వం ఐఏఎస్ అధికారులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేయగానే జేఏసీ ఈ నిరసనను వాయిదావేసింది. క్యాబినెట్ తాజా నిర్ణయాల నేపథ్యంలో ఈ నెల 9న తలపెట్టిన చలో హైదరాబాద్, లక్ష మంది ఉద్యోగులతో భారీ ర్యాలీ కార్యక్రమాన్ని కూడా జేఏసీ వాయిదావేసింది. క్యాబినెట్ భేటీ ముగిసిన తర్వాత, శుక్రవారం జరగాల్సిన జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశాన్నీ వాయిదావేశారు. జూన్ తర్వాత పెన్‌డౌన్ చేస్తామని, దశల వారీగా ఆందోళనలకు దిగుతామని జేఏసీ ప్రకటించింది. ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ చొరవకు జేఏసీ అభినందనలు తెలియజేసింది. దీంతో సమరం లేనట్టేనని స్పష్టమైంది.

జేఏసీ నేతల తీరుపై

సోషల్ మీడియాలో పోస్టులు

- చెత్త ఉద్యోగ సంఘాలు, యూనియన్ లీడర్లకు ముందే సూట్‌కేసులు ముట్టాయి. నాయకులు సర్కారుకు సరెండర్ అయ్యారు. వాళ్లకు ఉద్యోగుల బాధలు పట్టవు.
- తెరముందు ఉద్యోగుల డిమాండ్లు.. తెరవెనుక గచ్చిబౌలి సొసైటీ భూములు.. ప్లాట్ల మాయాజాలం.. ఇదంతా ముగ్గురు మొనగాళ్ల మహిమ.
- ఈ మొనగాళ్ల జేఏసీనీ, మొండిమొగుడు రేవంత్‌రెడ్డిని చూస్తే.. గతిలేని మొగుణ్ని కట్టుకుని, శృతిలేని సంసారం చేసినట్టుంది.
- పీఆర్సీ మాటే మరిచిండ్రా? మాకెందుకు పీఆర్సీ అని మడమతిప్పారా? కాంగ్రెస్ ఇచ్చిన హామీలను.. మ్యానిఫెస్టోను ఒక్క నాయకుడైనా ప్రశ్నించడం లేదేందుకో?
- అన్ని డిమాండ్లు గాలికొదిలేసి. జేఏసీని నవ్వులపాలుజేస్తిరి. ఆగం చేసి అవమానం పాలుజేస్తిరి. మా అందర్ని బిచ్చగాళ్లను జేస్తిరి. మీ పోరాటలేమికి వందనాలు. మీ చేతగానితనానికి శతకోటి వందనాలు.
- మోసపోయాం..మోసపోయాం.. మోసపోయింది ఇప్పుడుకాదు. 2023 నవంబర్‌లోనే అంతా మోసపోయాం.
- ఉపాధ్యాయ సంఘాలింతకు ఉనికిలో ఉన్నయా ? ఇతర సంఘాలు (టీఎన్జీవో, టీజీవో) టీచర్ సంఘాలను కలుపుకొని కరివేపాకులా వాడుకుని వారి సమస్యలు పరిష్కరించుకుంటున్నరు.
- ధర్నాలకే భయపడేవారు.. సమ్మెలేంచేస్తరు? ప్రభుత్వానికి విధేయులుగా మారిపోతున్నరు.
- ఇచ్చిన ఒక్క డీఏకు హర్షం వెలిబుచ్చిన జేఏసీ నాయకుడి తీరు ఉద్యోగుల ఆవేదనను అపహాస్యం చేసినట్టుంది.
- సమస్యలపై పోరాటాలు చేయాల్సిన సంఘాలు భజన సంఘాలుగా మారాయి.

డీఏలపై విసుర్లు

- ఐదు పెండింగ్ డీఏల్లో ఒక్కటి బిచ్చమేస్తే.. అదే మహాభాగ్యం అనుకున్నదా.. జేఏసీ?
- సృష్టిలో పంచభూతాలున్నట్టే.. ఉద్యోగులను ఐదు డీఏల భూతం విడిచేట్టు లేదు.
- ఒక్క డీఏ కోసమే మంత్రివర్గ ఉపసంఘం, త్రిసభ్య కమిటీ, ఇలా కమిటీల మీద కమిటీలేస్తున్నరు. పీఆర్సీ కోసం ఎన్ని కమిటీ లేసి ఎంతకాలం సాగదీస్తరో..?
- ఇచ్చింది ఒక్కటే.. కానీ రెండు డీఏలని గొప్పలు చెప్పుకుంటున్నరా? సోనియమ్మ జన్మదినం సందర్భంగానైనా ఇంకో డీఏ ఇస్తారేమో చూడాలి.
- ఆరు నెలలకు ఇంకో డీఏ అంటే ఏప్రిల్లోనా (జనవరి కదా).. ఇదేం లెక్కనో..? కాంగ్రెసోళ్లు కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నరు.
- ఆరు నెలలకు రెండో డీఏ, ఏడాది తర్వాత మూడోది, రెండేండ్ల తర్వాత నాలుగోది, మూడేండ్ల తర్వాత ఐదో డీఏ ఇస్తరేమో! పెండింగ్‌కు వీళ్లు బ్రాండ్ అంబాసిడర్లు అయ్యేలా ఉన్నరు.

> **సీపీఎస్ రద్దు ఊసెత్తకపోవడం బాధాకరం**
>
> కమిటీలు కాలయాపనకేనని మరోసారి నిరూపితమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా సీపీఎస్ రద్దు ఊసెత్తకపోవడం బాధాకరం. ఒక్క డీఏ కోసం వినతిపత్రాలు తీసుకోవడం, చర్చలు జరపడం విస్మయం కలిగించే అంశం. ఉద్యోగ సంఘాలన్నీ ఒక్క డీఏ నిర్ణయాన్ని వ్యతిరేకించాలి. తక్షణమే మూడు డీఏలను ప్రకటించి, సీపీఎస్‌ను రద్దుచేసి, మెరుగైన పీఆర్సీని ప్రకటించాలి.
>
> –హన్మండ్ల భాస్కర్, టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

> **మా పైసలు మాకిచ్చేందుకు ఇన్‌స్టాల్‌మెంట్లా?**
>
> గ్రాట్యుటీ, జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు కుప్పలుతెప్పలున్నాయి. మా పైసలు మాకిచ్చేందుకు కూడా ఇన్‌స్టాల్‌మెంట్లా? ఇది బాధాకరం. చాలా అన్యాయం. పెండింగ్ బిల్లులు నెలకు రూ.700 కోట్లు ఇస్తామన్నారు. మొదట వేటిని ఇస్తారు? రూ.పది లక్షలలోపా? అంతకుమించి ఇస్తరా? దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈహెచ్ఎస్‌ను ఎప్పటినుంచి అమలుచేస్తారో చెప్పలేదు. ఈ నెల 10న పెన్షనర్స్ జేఏసీ సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం.
>
> – లక్ష్మయ్య, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్

> **ఉద్యమాలను ఉద్ధృతం చేస్తం**
>
> దేశంలో ఎక్కడా ఇన్ని డీఏలు పెండింగ్‌లో లేవు. మేం కనీసం మూడు డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశాం. ఐదు పెండింగ్ డీఏల్లో కనీసం మూడు ఇస్తే అంతా సంతోషించేవాళ్లం. ఆరు నెలల్లో రెండో డీఏ ఇస్తామన్నారు. ఈ ఆరు నెలల్లో రెండు కొత్త డీఏలు చేరతాయి. ఈహెచ్ఎస్ జీవో గతంలోనే వచ్చింది. ట్రస్టు సభ్యులను నియమించాల్సి ఉన్నది. పీఆర్సీ మాటే ఎత్తడంలేదు. సాచివేత ధోరణి ప్రదర్శిస్తే ఐక్య ఉద్యమాలను ఉద్ధృతం చేస్తం.
>
> – చావ రవి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

> **ఉద్యోగ జేఏసీ ఏం సాధించిందో స్పష్టంచేయాలి**
>
> రెండొందల సంఘాలను కలుపుకుని జేఏసీగా ఏర్పడి, కార్యాచరణ ప్రకటించిన ఉద్యోగ జేఏసీ ఏం సాధించిందో స్పష్టంచేయాలి. తెచ్చేది.. ఇచ్చేది మేమే అన్న సంఘం నాయకులు ఏం తెచ్చారో.. ఏం ఇచ్చారో ప్రకటించాలి. తొక్కిపెట్టి నారతీస్తమని వార్నింగ్‌లు ఇచ్చిన నాయకులు ఇప్పుడెందుకు సైలెంట్ అయ్యారు? జేఏసీ నేతలు ప్రభుత్వం మీద పోరాడే స్థితిలో లేరు. వారు పత్రికా ప్రకటనలకే పరిమితం. ఉపాధ్యాయ సంఘాల ద్వారా మాత్రమే ఏదైనా సాధ్యం. ప్రభుత్వంపై పోరాటం చేయడమే ఉద్యోగుల కర్తవ్యం.
>
> – సుంకర శ్రీనివాస్, బీసీటీయూ

క్యాబినెట్ నిర్ణయాలు ఆనందదాయకం

- సర్కారు చొరవ అభినందనీయం
- క్యాబినెట్ నిర్ణయాలపై ఎంప్లాయీస్ జేఏసీ

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవకు తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ఇతర జేఏసీ నేతలు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో అనేక ఉద్యోగ అనుకూల నిర్ణయాలు తీసుకున్నారని జేఏసీ కొనియాడింది. ప్రధానంగా రెండు డీఏలు మంజూరు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను క్యాబినెట్‌లో ఆమోదించడం, తెలంగాణ ఉద్యోగుల జేఏసీకి చాలా ఆనందాన్ని కలగజేసిందని పేర్కొన్నారు. ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలు ఉన్నాయని, వాటినీ ప్రభుత్వం త్వరలోనే ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తుందనే ఆశాభావం వ్యక్తంచేశారు.

మాకు క్షమాభిక్ష పెట్టండి!

- మమ్మల్ని ఉద్యోగంలోకి తీసుకోండి
- వందలాదిమంది ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదన.. విన్నపం
- బయటికి లాక్కెళ్లిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): రద్దీగా ఉన్న బస్సులో ప్రయాణికుడు టికెట్ తీసుకోకపోతే సస్పెండ్ అయిన వారు కొందరు! టికెట్ కొట్టిన తర్వాత అంత డబ్బు లేదని బస్సు దిగితే ఆ టికెట్ వే